

## సంపాదకీయం

# మన గమ్యం గురించి ఆందోళన

హక్కుల కోసం పని చేసే వాళ్లకు చేతి నిండా పని ఎప్పుడూ ఉంటుంది. పని భారం వల్ల ఉక్కిరిబిక్కిరి అయ్యే పరిస్థితి కూడా తరచుగా ఉంటుంది. అయితే ఇప్పుడు పని భారం వల్లనే కాక ఏదో అవ్యక్తమయిన ఆందోళన వల్ల కూడా ఎన్నడూ లేనంతగా ఉక్కిరిబిక్కిరవుతున్న అనుభవం హక్కుల ఉద్యమకారులందరికీ ఉంది.

ఇది హిందుత్వవాదులు సామాజికంగా, రాజకీయంగా బలపడడం వల్ల కలుగుతున్న ఆందోళనా? కొంతవరకు నిజమేగానీ అది మాత్రమే కాదు.

గ్లోబలైజేషన్ పేరు మీద మానవ హక్కుల ఉనికికి మన పాలకులు తీసుకొస్తున్న తీవ్ర ప్రమాదం కలిగిస్తున్న ఆందోళనా? కొంతవరకు అది కూడా నిజమేకానీ అది మాత్రమే కాదు.

పోలీసు అధికారులు గతంలో ఎన్నడూ లేనంత బాహాటంగా తాము చట్టానికి అతీతులమని ఛాతీ విరుచుకుని ప్రకటిస్తూ హత్యలు చేస్తున్న ఉదంతాల పరంపర కలిగిస్తున్న ఆందోళనా? అది సహితం నిజమే కానీ అది మాత్రమే కాదు.

విడివిడిగా ఆందోళనను పెంచే విషయాలిటువంటివి ఇంకా కూడా ఉన్నాయి. కానీ అవిగానీ, వాటి మొత్తంగానీ ఈ ఆందోళనకు పూర్తి కారణం కాదు.

అంతకు మించి ఏవో పునాదులు కదిలిపోతున్న భావన ఒకటి కలుగుతున్నది. ఏమిటా పునాదులు? ప్రజాస్వామ్య పునాదులా, మానవ హక్కుల పునాదులా? అని ప్రశ్నించుకుంటే గడచిన యాభై ఏళ్లలో వీటికి స్థిరమైన పునాదులు ఏర్పడ్డాయనే అభిప్రాయం హక్కుల ఉద్యమకారులెవ్వరికీ లేదు కాబట్టి ఇప్పుడేం కదిలిపోతున్నదని ఇంత ఆవేదన? ఉన్న కొంచెం పోతుందేమోనని ఆవేదన చెందుతున్నామా? అది కూడా కొంతవరకు నిజమే, అంతమేరకు సబబే. కానీ ఈ జవాబు కూడా హక్కుల ఉద్యమకారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పరిణామాలకు సంతృప్తికరమైన వివరణ కాదు.

మనం ఫలానా, మన స్వరూపం ఫలాన, మన గమ్యం ఫలాన అనే 'ఐడెంటిటీ' దెబ్బతిన్నప్పుడు కలిగినంత లోతయిన ఆందోళన - వ్యక్తులకుగానీ సమూహాలకుగానీ- వేరే ఎప్పుడూ కలగదు.

'ఇండియా అనే భారతదేశం' ఏమిటి? ఇది ఎటువంటిది, దీని స్వరూపం ఏమిటి? దీని గమ్యం ఏమిటి? అన్న 'ఐడెంటిటీ' ఒకటి నిన్నటి దాకా ఉండిందనీ అది ఇప్పుడు విచ్ఛిన్నమవుతున్నదనీ అందరమూ అంతరాంతరాలలో ఆందోళన చెందుతున్నాము. భారతదేశం అనే భావన బూటకం అనే రాజకీయ విశ్వాసం కలిగిన వారు సహితం ఈ ఆందోళనకు అతీతం కాదు.

చాలా భిన్నమైన రాజకీయాలను విశ్వసించిన వారు సహితం యాభై ఏళ్లుగా ఈ ఐడెంటిటీని పంచుకున్నారని ఈ రోజు ఆలోచిస్తే అర్థమవుతుంది. భారతదేశపు గత చరిత్ర ఏమైనాకానీగాక, దీని భవిష్యత్ స్వరూపం మాత్రం సమతా న్యాయాలకు నిలయమైన ఒక మానవీయమైన సమాజం. ఈ దేశం ప్రపంచాన్ని బెదిరించి భయపెట్టి లొంగదీసుకోగల అగ్రరాజ్యం కానక్కరలేదుగానీ మంచికీ మానవతకూ నిలయమన్న ప్రతిష్ఠను ప్రపంచ దేశాలలో పొందాలి, పొందుతుంది. ఇది జపాన్ లాగా అమెరికా లాగా శరవేగంగా ఆర్థిక అభివృద్ధిని సాధించకపోవచ్చునుగానీ శాంతి సామరస్యాలకు నిలయమైన గొప్ప నాగరికతను రూపొందించాలి, రూపొందిస్తుంది. ప్రపంచాన్ని గెలవకపోవచ్చునుగానీ అన్యాయాన్ని జయిస్తుంది.

గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, లోహియా, కమ్యూనిస్టులు, పెరియార్- ఆధునిక భారత రాజకీయాల స్వరూపాన్ని నిర్దేశించిన వారందరూ- ఎన్ని విషయాలలో ఎంతగా సంఘర్షించినా, ఆ సంఘర్షణ ఎంత మౌలికమైనదని ఎవరికి వారు భావించినా- అందరూ అంతరాంతరాలలో పంచుకున్న 'ఐడెంటిటీ' ఇది. 'ఇండియా అనే భారతదేశం' ఇది అనే నిర్వచనం ఎంతగా మన చైతన్యంలో భాగం అయిపోయిందంటే వీరందరూ తమ మధ్య అనేక విభేదాలున్నాయని గుర్తించారే తప్ప ఆ విభేదాల వెనక ఈ ఉమ్మడి గమ్యం ఉందని గుర్తించలేదు. సగటు భారత పౌరులు కూడా ఈ గమ్యాన్నే, ఈ ఐడెంటిటీనే పంచుకున్నారని ఎటువంటి అతిశయోక్తి లేకుండా, ప్రజలు అనే భావనను 'రొమాంటిసైజ్' చేయకుండా కచ్చితంగా చెప్పవచ్చు.

ఆ 'ఐడెంటిటీ'ని ఏ రోజూ పంచుకోని ఒకే ఒక రాజకీయ సాంఘిక శక్తి, సంఘ్‌పరివార్ అని పిలవబడే హిందుత్వ వాదులు. వీరివ్వాళ సాంఘికంగా, రాజకీయంగా ఆధిపత్య స్థానాన్ని అందుకుంటున్నారు. కాగా ఆ ఐడెంటిటీ అక్కరకురాని చాదస్తం అని నమ్మే కొత్త తరమొకటి కూడా ఈ యాభై ఏళ్ల సామాజిక ఆర్థిక అభివృద్ధి నుండి పుట్టుకొచ్చింది. ఈ తరం ఆవిర్భావానికీ పెరుగుతున్న సంఘ్‌పరివార్ ఆధిక్యతకూ మధ్యనున్న సంబంధాన్ని విశ్లేషించడానికిది సందర్భంకాదుగానీ ఈ రెండు పరిణామాల ఫలితంగా 'మనం' అనే ఐడెంటిటీకి ఏర్పడిన విచ్ఛిత్తి ఈనాటి ఆందోళనకు మూలం అనడంలో సందేహమక్కర లేదు.

మరి వీళ్లకేం కావాలి? వీళ్లు భావించుకుంటున్న 'ఇండియా అనే భారతదేశం' ఎట్లాంటిది? అదెందుకు మానవహక్కుల స్పృహ ఉన్నవాళ్లకు ఇంత ఆందోళన కలిగిస్తున్నది?

ఆర్‌ఎస్‌ఎస్ నూతన సర్ సంచాలక్‌గా ఎన్నికైన తెల్లవారే సుదర్శన్‌జీ ఈ ప్రశ్నకు జవాబు చెప్పాడు. రాజ్యాంగాన్ని అవతల పారేయాలని అంటూ, సరైన రాజ్యాంగం రాసుకొని ఉంటే ఈ పాటికి భారత్ ఒక ఆర్థిక 'సూపర్ పవర్' అయి ఉండేదని అన్నాడు. ఆర్థిక విధానాలను గురించి మాట్లాడుతూ అన్నాడు కాబట్టి ఆర్థిక సూపర్‌పవర్ అన్నాడుగానీ 'సూపర్‌పవర్' అనేది అక్కడ ముఖ్యమైన మాట.

సంఘ్‌పరివార్ భావించుకునే భారతదేశం 'మగతనం' ఉన్న మేటి జాతి. తన విమానాన్ని పొరుగుదేశం పంపిన మిలిటెంట్లు హైజాక్ చేసి తీసుకుపోతే 'గాజులు తొడుక్కుని' కూర్చోదు. ప్రయాణీకులు చచ్చిపోతారని చెప్పి ఖైదీలను విడిచిపెట్టదు. పొరుగుదేశం తయారుచేసిన

మిలిటెంట్లు తన సరిహద్దులు దాటి వచ్చి తన భూభాగంలో బీభత్సం సృష్టిస్తుంటే రాజకీయ పరిష్కారమంటూ చేతకాని చర్చలు పెట్టుకోదు. 'ప్రో-ఆక్టివ్'గా సరిహద్దులు దాటి పొరుగుదేశంలోకి ప్రవేశించి మిలిటెన్సీని భూస్థాపితం చేస్తుంది. 'నేను చెప్పిందంతా సత్యమని నువ్వు ఒప్పుకుంటేనే నీతో చర్చలు పెట్టుకుంటాను'ని (ఈ మధ్య అటల్ బిహారీ అన్నట్టు) పొరుగు దేశాన్ని దబాయిస్తుంది. చివరికి వాళ్లను నోరెత్తకుండా అణిచేసి మీసం మెలివేస్తుంది. ఈ క్రమంలో ఇటూ అటూ కొన్ని వందలమందో వేల మందో చచ్చిపోవచ్చుగాక, అవన్నీ ఆలోచిస్తూ మథనపడటం 'సూపర్‌పవర్' లక్షణం కాదు.

ఆర్థిక రంగంలోనూ అంతే. 'ఆర్థిక పురోభివృద్ధి ఫలితంగా సంపద కొద్దిమంది చేతిలో పోగై సమాజం ఉమ్మడి ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి రాకుండా చూసుకోవాల'ని భారత రాజ్యాంగం ఆర్టికల్ 39 (సి)లో అంటుంది. ఇది ఆర్థిక సూపర్‌పవర్‌లు ఆలోచించే పద్ధతి కాదు. ఎప్పటికప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటూ వెనకున్న వారు ఏమైపోయారో అని చింతించే వారు పరుగు పందెంలో గెలవరు. 'ది డెవిల్ టేక్ ది హైండ్ మోస్ట్' అని ఇంగ్లీష్‌లో అంటారు. ఇటువంటి వైఖరి ఉన్నవాళ్లే గెలుస్తారు. సూపర్‌పవర్ కాదలచుకున్నవారు ఇట్లాగే ఆలోచిస్తారు (అందుకే ఈ రాజ్యాంగాన్ని బయటపారేయమని సుదర్శన్‌జీ అన్నారని ఇప్పుడర్థం అయి ఉండాలి).

ఇక్కడే సుదర్శన్‌జీ ఆలోచనలు పైన చెప్పిన కొత్త తరం ఆలోచనలతో కలుస్తాయి. ఈ కొత్త తరంలోని వారందరూ ఖాకీ నిక్కర్ల యోధులుకారు, కాషాయాంబర ధారులూ కారు. అందరూ హైందవ దురభిమానులు కాకపోవచ్చు, ఆ అర్థంలో 'లౌకికవాదులు' కావచ్చు. కానీ వారికీ వీరికీ ఒక సామాన్య లక్షణం ఉంది. ఇద్దరూ భావించుకునే 'ఇండియా అనే భారతదేశం' ఆర్థిక, రాజకీయ, సైనిక సూపర్‌పవర్‌గా తననుతాను భావించుకోవడానికి సిగ్గుపడని 'పౌరుష'మున్న జాతి. అది తప్పనీ, సమతకూ న్యాయానికీ శాంతి సామరస్యాలకూ నిలయంగా ఉండాలనే చాదస్తపు లక్ష్యమే ఉండాలనీ భావించే వెనకటి రోజులకు చరమగీతం పాడి, వేగంగా పురోగమించడానికి సిద్ధపడుతున్న జాతి. ***న్యాయబద్ధమైన సమాజం స్థానంలో శక్తివంతమైన జాతిని దేశగమ్యంగా నిలబెట్టడం కాషాయ సంఘ్‌పరివార్‌కూ హైటెక్ కొత్త తరానికీ ఉన్న సామాన్య లక్షణం.***

రెండూ సాధ్యం కావా అన్న సందేహం రాగలదు. గమ్యం అనేది ఎక్కడో నిలబెట్టుకున్న మైలురాయి కాదు. గమ్యం గమనాన్ని శాసిస్తుంది. న్యాయాన్ని కాంక్షించే గమ్యం నిర్దేశించే గమనం వేరు, బలాన్ని ఆరాధించే గమ్యం నిర్దేశించేది వేరు. ఈ సంగతి ఒకనాటి ఆర్‌ఎస్ఎస్ సర్‌సంచాలక్ గోల్వాల్కర్ స్పష్టంగానే గుర్తించాడు. హక్కులు, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం అంటూ జాతి లోపలి విభేదాలనూ వైరుధ్యాలనూ 'రెచ్చగొడుతూ' పోతే జాతి బలహీనపడుతుంది. బలాన్ని ఆరాధించే వారికి అలవాటయిన మగతనపు పరిభాషలో చెప్పాలంటే జాతిలోపల న్యాయాన్ని కాంక్షించే వైఖరి జాతిని 'నిర్వీర్యం' చేస్తుంది. గోల్వాల్కర్‌తో ఏమంత పోలిక లేనట్టు కనిపించే హైటెక్ డాట్‌కామ్ తరం కూడా అదే అంటుంది. మాలవాళ్లు, మాదిగవాళ్లు, ఆడవాళ్లు, కుంటివాళ్లు, గుడ్డివాళ్లు అంటూ వనరులన్నీ అవకాశాల పెంపుదల పేరిట వృథా చేసుకుంటూ పోతే మన జాతీయ ఆదాయం పెరుగుదల రేటు ఇప్పుడున్న అయిదు శాతాన్ని దాటదు. ఆర్థిక సూపర్‌పవర్ కాగల శక్తినంతా సమతా న్యాయాల అన్వేషణలో వృథా చేసుకుంటున్నాం.

కాబట్టి రెండూ సాధ్యం కావు. న్యాయమైన సమాజం కావాలా లేక బలమైన జాతి కావాలా అన్నది అందరం నిర్ణయించుకోవలసిన తరుణం వచ్చింది. 'రాజ్యాంగ సమీక్ష'కు సంబంధించిన సంవాదం వెనుకనున్న అసలు చర్చ ఇదేనన్న సంగతి అంతర్లీనంగా అందరికీ అర్థమయింది కాబట్టే పైకి చూస్తే

ఏమంత ఆందోళన చెందవలసిన విషయంగా కనిపించనిది కూడా ఇంత ఆందోళన కలిగిస్తున్నది. ఎందుకంటే మన రాజ్యాంగంలో అభ్యంతరకరమైన, అసంతృప్తికరమైన విషయాలు వేరే ఎన్ని ఉన్నా అందులోని గొప్ప సద్గుణం ఏమిటంటే అది దేశలక్ష్యాన్ని న్యాయబద్ధమైన సమాజంగా నిర్వచించింది. బలమైన జాతిని దేశ లక్ష్యంగా నిలబెట్టడానికి ఈ రాజ్యాంగంలో చోటు లేదు.

కానీ కేవలం రాజ్యాంగాన్నేకాక దేశం గమ్యాన్నీ, మనం ఎవరు, మనం ఏమిటి అనే 'ఐడెంటిటీ' నీ సమూలంగా మార్చడానికి నేడు జరుగుతున్న ప్రయత్నాన్ని నిలువరించగలమా? వెనక్కి తిప్పగలమా? తిప్పలేకపోతే ఏం జరుగుతుంది? ఇంక పది సంవత్సరాలకు మానవ హక్కుల పరిస్థితి ఏ విధంగా ఉంటుంది? ఈ ఆందోళనే ప్రజాస్వామ్యాన్నీ మానవతనూ ప్రేమించే వాళ్లందరినీ కలచివేస్తున్నది.

ఈ ఆందోళనకు మా దగ్గర సమాధానం ఉందని మేము అనలేము. కానీ ఈ ఆందోళనే మా ఆచరణనూ ఆలోచనలనూ నడిపిస్తున్నదని మాత్రం చెప్పగలం. అందులో నుండే ఏ సమాధానమైనా దొరకగలదు.

## ఇక ఈ బులెటిన్ గురించి...

'అభివృద్ధి' రెండంచుల కత్తి అనడానికి పారిశ్రామిక కాలుష్యం ఒక నిదర్శనం. ఒక వైపు సామాజిక సంపదను, కొంతమందికి ఆస్తులను పెంచుతూ పోయే పారిశ్రామిక అభివృద్ధి మరొకవైపు పరిశ్రమల పరిసరాలలో చాలా విధ్వంసానికి కారణమవుతున్నది. దానికి బలయ్యే ప్రజలు ఆందోళనకు దిగినప్పుడు తప్ప ఈ విధ్వంసం సమాజం దృష్టికి రాదు. హైదరాబాద్ నగర పారిశ్రామీకరణ సృష్టించిన విధ్వంసాన్నీ దానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళననూ వివరిస్తూ ఎం.కోదండరాం ఒక వ్యాసం రాశారు.

కరువు కూడా ఒక మేరకు అభివృద్ధి రెండవ ముఖమైన విధ్వంసం ఫలితమే. వేగంగా, మరింత వేగంగా అభివృద్ధి సాధించాలన్న చంద్రబాబు నమూనా స్వర్ణాంధ్రప్రదేశ్ స్వప్నం ఈ విధ్వంసాన్ని కూడా రాబోయే రోజులలో మరింత పెంచే ప్రమాదం ఉంది. ఈ సంవత్సరం రాష్ట్రంలోని భిన్న ప్రాంతాలలో నెలకొన్న కరువు గురించి వివరమైన నివేదికను మానవహక్కుల వేదిక త్వరలో ప్రచురిస్తుంది. ప్రస్తుతానికి అనంతపురం కరువు చిత్రాన్ని స్థూలంగా వివరించే ఎస్.ఎం.బాషా వ్యాసాన్ని ఈ బులెటిన్‌లో వేస్తున్నాం.

ఎప్పుడో ఒకప్పుడు తిరిగిరాక తప్పదని అయిదేళ్లుగా ఆందోళనతో ఎదురుచూస్తున్న టాడా త్వరలోనే తిరిగి రానున్నది. కేంద్రప్రభుత్వం 1995లో రూపొందించిన కొత్త టాడా బిల్లును 1999లో ఇంకొంచెం సవరించి, మంచి చెడులు పరిశీలించి సలహాలివ్వవలసిందిగా కోరుతూ భారత లా కమిషన్‌కు అప్పగించగా ప్రజాస్వామ్యవాదిగా అంతోఇంతో పేరున్న లాకమిషన్ చైర్మన్ జీవన్‌రెడ్డిగారు కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన కొద్దిపాటి సవరణలు కూడా అక్కరలేదని చెప్పి పాత నమూనాలోనే కొత్త టాడా బిల్లును తయారు చేసి ప్రభుత్వానికి తిరిగి పంపారు. అది రేపోమర్నాడో చట్టం కాగలదు. దీనిపైన కె.బాలగోపాల్ వ్యాసం ఈ బులెటిన్‌లో ప్రచురిస్తున్నాం.

జీవన్‌రెడ్డిగారి ఆధ్వర్యంలోని భారత లాకమిషన్ అత్యుత్సాహంగా చేసిన మరొకపని ఎన్నికల సంస్కరణల పై ఎవ్వరూ అడగకుండానే ఒక సమగ్రమైన చట్ట సవరణను తయారు చేసి కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచడం. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత పెంచడం కోసం చేసిన కొన్ని

ఉపయోగకరమైన సూచనలు ఇందులో ఉన్నప్పటికీ ప్రధానంగా ఎన్నికలకుండే ప్రాతినిధ్య స్వభావాన్ని పెంచే లక్ష్యంతో కాక ఎన్నికయిన ప్రభుత్వాల స్థిరత్వాన్ని పెంచే లక్ష్యంతో చేసిన ఈ ప్రతిపాదనలు ప్రజాస్వామ్యానికి మేలు కంటే నష్టమే ఎక్కువ చేయగలవు. ఈ విషయాన్ని వివరించే కె. బాలగోపాల్ వ్యాసం ఈ బులెటిన్‌లో ఉంది.

'రాజ్యాంగ సమీక్ష' ఈ మధ్యకాలంలో అందరినీ కలవరపరుస్తున్న విషయం. ఈ కలవర పాటుకు గల కారణాన్ని పైన వివరించాము. ఇది దేశ గమ్యాన్నే ఒక అమానవీయమైన దిశలో పునర్నిర్వచించే ప్రయత్నం. దానిని ఏ విధంగా చూడాలో, ఏ విధంగా అర్థం చేసుకోవాలో ఎం. కోదండరాం తన వ్యాసంలో వివరించారు.

ఉరిశిక్ష వంటి కఠినమైన శిక్షలను వ్యతిరేకించేటప్పుడు, టాడా వంటి క్రూరమైన నేర విచారణ పద్ధతులను విమర్శించేటప్పుడు, నేరం అంటే ఏమిటి, నేరస్తులంటే ఎవరు, ఏవి సమాజానికి నిజంగా హానికరమైన నేరాలు అనే ప్రశ్నలు అనివార్యంగా మన ముందుకొస్తాయి. చట్టం, నేర విచారణ వ్యవస్థ, సామాజిక భావజాలం ఈ ప్రశ్నలకు కొన్ని జవాబులను తయారు చేసి మన ఆలోచనలలో చొప్పించే వైనాన్ని బి.చంద్రశేఖర్ వ్యాసం విశ్లేషిస్తుంది.

ఈ బులెటిన్‌తో 'జుడీషియల్ వాచ్' అనే శీర్షిక మొదలు పెడుతున్నాం. దేశ పాలనా వ్యవస్థలోనూ రాజకీయాలలోనూ వేగంగా ముందుకొస్తున్న అప్రజాస్వామిక పోకడలు న్యాయవ్యవస్థలోనూ కనిపిస్తున్నాయి. ఎటొచ్చీ పాలనా వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ చాలా విమర్శలకూ అందోళనలకూ గురి అవుతుండగా న్యాయవ్యవస్థ మాత్రం తప్పించుకోగలుగుతున్నది. న్యాయ వ్యవస్థ నిష్పక్షికంగా న్యాయం చేస్తుందన్న భావజాలం ప్రబలంగా ఉండడం దీనికొక కారణం. న్యాయస్థానాల తీర్పులు సామాన్య ప్రజలకర్థంకాని చట్ట పరిభాషలోనూ న్యాయ సిద్ధాంత నుడికారంలోనూ ఉండడం మరొక కారణం. అందువల్ల న్యాయవ్యవస్థ గాడి తప్పి రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకూ ప్రాథమిక హక్కులకూ రాజ్యాంగ లక్ష్యాలకూ విరుద్ధంగా ఇచ్చే తీర్పులను విమర్శించే విశ్లేషణను ప్రజల ముందుంచడం అవసరమని భావించి ఈ శీర్షిక ప్రారంభిస్తున్నాం. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసి కోటీశ్వరుల కంపెనీలలో మేనేజర్ల పోస్టులకు యువకులను తర్ఫీదు చేసే 'బిజినెస్ స్కూలు' అని పిలవబడే వ్యాపార కంపెనీకి ప్రభుత్వం ఉదారంగా భూములు ఇవ్వడం రాజ్యాంగ బద్ధమేనంటూ మన హైకోర్టు ఇచ్చిన తీర్పులను విశ్లేషిస్తూ కె.సుధ రాసిన వ్యాసాన్ని ఈ బులెటిన్‌లో ప్రచురిస్తున్నాం.

ఈ మధ్య మన రాష్ట్రంలో పోలీసులు మొదలుపెట్టిన పబ్లిక్ రిలేషన్స్ జాతర- మైత్రీ సదస్సులు- పత్రికలలో తరచుగా దర్శనమిస్తున్నాయి. ప్రజలకూ పోలీసు వ్యవస్థకూ మధ్య స్నేహసంబంధాలు కొరవడ్డాయని చెప్పి ఈ జాతర మొదలుపెట్టారు. దీని కోసం ప్రజల సొమ్ము ఎంత ఖర్చు పెడుతున్నారో తెలీదుగానీ, నిజంగానే ప్రజలతో స్నేహసంబంధాలు పెంచుకోవాలన్న కోరిక ఉంటే, పోలీస్‌స్టేషన్‌లో అందరికీ నిష్పక్షికంగా రక్షణ దొరుకుతుందన్న విశ్వాసం ప్రజలలో పెంపొందించడం తప్ప వేరే మార్గం లేదు. ఆ విశ్వాసం లేకపోవడానికి పోలీసు వ్యవస్థ వ్యవహారశైలిదే తప్ప వేరే ఎవ్వరిదీ బాధ్యత కాదు. ఈ విషయానికి అద్దం పట్టే ఒక సజీవగాథ వరంగల్ జిల్లాకు చెందిన సరోజన పోరాటం. దానిపైన బుర్రరాములు రిపోర్టు ఈ బులెటిన్‌లో ప్రచురిస్తున్నాం.

ప్రకృతి వనరులను ఏ విధంగా చూస్తామనేది చంద్రబాబు నమూనా 'అభివృద్ధి' విధానాలు తీసుకొచ్చిన ముఖ్యమైన ప్రశ్నలలో ఒకటి. వనరులు ప్రజల జీవన వనరులుగా ఉంటే వారు

బతుకుతారే తప్ప ప్రభుత్వానికి 'అభివృద్ధి' రాదు, అంటే రాష్ట్ర ఆదాయం పెరుగుదల రేటు వేగం పుంజుకోదు. వనరులను పెట్టుబడికి వనరులుగా చూస్తేనే అది జరుగుతుంది. భూమి అనే వనరును ఈ కోణం నుండి చూడడం హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఈ మధ్య కాలంలో జరుగుతున్న ప్రయత్నాల సారాంశం. హైదరాబాద్‌ను పర్యాటక కేంద్రంగా మార్చి, పర్యాటక రంగంలో ఇప్పటికే స్థిరపడిఉన్న పెట్టుబడిని హైదరాబాద్‌లోకి ఆకర్షించాలంటే మూసీనది తీరప్రాంత భూములను ప్రజల చేతి నుండి తీసేసి పర్యాటక కేంద్రాల కోసం కేటాయించాలి. ఆ క్రమంలో ప్రజల నివాస హక్కు, జీవించే హక్కు దెబ్బ తింటున్న తీరు గురించి, దానికి వ్యతిరేకంగా మూసీ మరీవాహక ప్రాంత వాసులు చేస్తున్న ఆందోళనల గురించి ఎస్.జీవన్‌కుమార్ రాసిన రిపోర్టును ఈ బులెటిన్‌లో ప్రచురిస్తున్నాం.

మళ్లీ 3వ బులెటిన్ వచ్చే వరకు మీ నుండి సెలవు కోరుకుంటూ-

**-మానవహక్కుల వేదిక**

**15.06.2000**